# కథా వస్తువు

సుప్రసిద్ధ కథకులు తుకారాంగారు కథా సాహిత్యాన్ని గురించి వుపన్యసిస్తారంటూ చప్పున కూర్చున్నాడు అధ్యక్షుడు.

ఒక్క గ్లాసు మంచినీళ్లు త్రాగి లేచి మైకు ముందు నిల్చున్నాడు తుకారాం గారు.

సభికులంతా నిశ్శబ్దంగా సర్దుకొని కూచుంటున్నారు. ఉత్తరపు కొనలో ఎవరో చంటిపాప కెవ్వుమంటుంటే ఆ మహాతల్లి చడీ చప్పుడు చేయకుండా బిడ్డ నెత్తుకొని సభ నుండి నిష్క్రమించింది.

సభాసదులకు నమస్కరించిన తదనంతరం కథకులు తుకారాంగారు కొంచెం హెచ్చు స్థాయిలో ఉపన్యాసం మొదలు పెట్టారు.

"ఈ మధ్య వెలువడుతున్న కథా సాహిత్యాన్ని అత్యంత శ్రద్ధతో పరిశీలిస్తున్న వారిలో నేనూ ఒక్కణ్ణి. తెలుగు సారస్వతంలో కథలు విరివిగా వెలువడుతున్నాయని చెప్పడానికి నాకెంతో గర్వంగా వుంది. కానీ ఆ కథలలో విభిన్న రుచులు ఎక్కువగా కన్పించకపోవడం కొంత విచారకర మనక తప్పదు.

నేనిలా అంటున్నందుకు క్షమించాలి. చాలామంది ఒకే రకమైన కథలు వ్రాస్తున్నారు. ఎటూ ప్రయత్నిస్తున్నారు, గనుక కథా శిల్పంలో కొంగ్రొత్త మార్గాలను ఆరంభించాలి.

ఇటీవలి ఒక మిత్రునితో ఈ మాటే అన్నాను. ఆయన తక్షణం ఒక ప్రశ్న వేశాడు. "కథా వస్తువు మంచిది దొరక్కపోతే ఏం చెయ్యాలి?" అని.

ఇక్కడే మనం ఆలోచించవలసిన విషయం ఇమిడి వుంది. కథా వస్తువు ఏదైనా కావచ్చు. ఏ చిన్న అణువునైనా ఆధారం చేసుకొని బ్రహ్మాండాన్ని ప్రస్ఫుటింప చేయవచ్చు.

"ఏదో సెలవివ్వండి" ఎవరో విద్యార్థివలె వున్నాడు. మధ్యలో ప్రశ్నించాడు.

ముందు వరుసలో కూచున్న యువ రచయితల్లో కొందరు అతని వంక "చెబుతున్నారుగా" అన్నట్టు చూశారు.

తుకారాం గారు దగ్గుతూ "మంచినీళ్ళు" అన్నారు.

గ్లాసులో మంచినీళ్ళు ఖాళీ కాగానే ఆయన చేతి రుమాలుతో ముఖం తుడుచుకొని.

"కథా వస్తువు ఏదైనా కావచ్చునన్నానుగా. ఇప్పుడు త్రాగిన మంచినీళ్లు కూడా ఒక కథా వస్తువే. ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. ఆనాటి విషయం.

నాకు పెళ్ళీడు వచ్చిందని మా వాళ్ళు హెచ్చరించే వరకూ నాకు తెలిసింది గాదు (చప్పట్లు నవ్వులు) నాలుగైదు సంవత్సరాలు వినీ విన్పించుకోక తప్పించు కొంటూ తిరిగాను. కానీ చివరికి ఆట కట్టేశారు. నాకూ ఒక సంస్కర్త కావాలనే ఆశ వుండేది. వర్ణాంతర వివాహం చేసుకోవాలనే ఉబలాటంతోనే వాయిదా వేస్తూ వచ్చాను. చివరికి కులంలోనే నాకు నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకొనేందుకు స్వాతంత్ర్యాన్ని సాధించాను. నా దృష్టిలో మా కులానికి సంబంధించి ఇదీ ఒక విప్లవమే. ఎందుకంటే పెద్దలు చెప్పిన పిల్లను పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయాన్ని వుల్లంఘించడం జరిగింది కనుక.

ఇంతవరకూ చెప్పిందంతా కథా వస్తువుకు వుపోద్ఘాతమే. ఇప్పుడు చెప్పబోతున్నదే అసలు కథ."

తుకారాం గారు మళ్ళీ గ్లాసునందుకొని రెండు గుక్కలు మంచినీళ్లు త్రాగారు. ఈ మారు అడక్కనే రెండు గ్లాసుల నిండుకూ మంచినీళ్ళను బల్ల మీద వుంచారు నిర్వాహకులు.

"మాటి మాటికీ మంచినీళ్ళు త్రాగడం నాకొక అలవాటు. సరాసరి రోజుకు నలభై గ్లాసులు త్రాగేస్తుంటాను. ఈ వాడుకే నాకు కన్యాన్వేషణలో బాగా ఉపయోగ పడింది. ఎన్నో చోట్ల తిరిగాను. ఎక్కడికి వెళ్ళినా ముందుగా మంచి నీళ్ళు అడిగే వాణ్ణి. ఆ ఇంట్లో ఎవరున్నా సరే. ఎవరో అతిథులు వచ్చారని చప్పున మంచినీళ్లు అందిచ్చే వారు. ఆ ఒక్క అవకాశంతో నేను వెళ్ళిన పని దాదాపు పూర్తి అయిపోతుండేది. అన్ని సంఘటనల గురించీ నేనిపుడు చెప్పలేను. వ్యవధి కూడా చాలదు. పైగా ఆ సంఘటనలలో ప్రతి ఒక్కటీ ఒక్కొక్క కథగా వ్రాసుకోవాలని వుంది. అనుభవాలలోని సంఘటనలను చిత్రించుకోవడం అదో సంతృప్తి. అది అత్యంత రసవత్తరమైన రచనగా రూపొందుతుంది కదా.

ఒక్క సంఘటన మాత్రం చెబుతాను.

ఆ వూరు అన్నపూర్ణలాగే కన్పించినా అదో ప్రత్యేకతతో వున్నట్టు తోచింది నాకు. ఆ గ్రామాన్ని నా చిన్నతనంలో బహుశా పదో ఏట కావచ్చు చూశాను. అప్పుడా అమ్మాయి ఏడాది పిల్ల కావచ్చునేమో! లేదా మూడేళ్ళ బాలిక కావచ్చు. ఆ గ్రామానికి నేను మళ్ళీ వెళ్ళలేదు. చివరికి కన్యాన్వేషణార్థమై వెళ్ళవలసి వచ్చింది.

ఫలానావారి ఇల్లు ఎక్కడండీ అంటూ ప్రారంభించాడు నా మిత్రుడు. ఆయన ఇంట్లో లేడని బదులు వచ్చింది. చాలా మంచిదే అనుకొన్నాను. ఇంట్లో అడుగు పెట్టీ పెట్టగానే ఆ కన్య మాత్రమే ఎదురు పడాలనీ ఆమెనే పల్కరించాలనీ నా కోరిక.

సరాసరి ఇంట్లో ప్రవేశించాము. వసారాలో ఎవరూ లేరు. వంటగదిలో మాత్రం ఎవరో వున్నట్టు అలికిడి విన్పించింది.

"ఎవరండీ లోపల" ప్రశ్నించాడు నా మిత్రుడు.

"ఏమండీ ఎవరి కోసం అడుగుతున్నారు" సన్నని స్వరం.

"మేము మీ అన్నగారి కోసం వచ్చాము."

"ఆయన మధ్యాహ్నం వస్తారు" ఆ జవాబు లోపలి నుండి వస్తున్నది కానీ ఆమె వెలుపలకు రాలేదు.

ఇక నా అలవాటు ప్రకారం "కొంచెం మంచినీళ్ళివ్వండి" అన్నాను.

ఆమె మంచినీళ్ళ చెంబును కడపలో పెట్టింది. ఆమె కుడి చేయి మాత్రం కన్పించింది.

నా మిత్రుడా చెంబునందుకొని రెండు గుక్కలు త్రాగి మిగిలింది ఒలక బోశాడు.

ఇంతలో ప్రక్కింటి ముసలామె అక్కడికి వచ్చింది.

"మరికొంచెం నీళ్ళు కావాలి" అన్నాడు నా మిత్రుడు.

ఆమె ఈమారు కొంచెం పెద్ద చెంబుతో నీళ్లు ముంచి కడపలో పెట్టింది. ఈ మారూ ఆమె ముఖాన్ని చూపలేదు. నే నా చెంబు నందుకొన్నాను. అందులో ఇంచుమించు మూడు గ్లాసులు నీళ్ళుండవచ్చు. ఒక గ్లాసు పుక్కిలించి ఉమ్మి వేశాను. మిగిలిన రెండు గ్లాసులూ త్రాగివేశాను.

ఆమె బయటకు రాలేదు. ముసలామె నా మిత్రునితో మాట్లాడుతోంది.

ఈ మారు ప్రయత్నించకుంటే వచ్చిన పని పూర్తి కాదనుకున్నాను. "మరి కొంచెం నీళ్ళిస్తారూ?" అంటూ ఆ చెంబును కడపలో వెలుపలి ప్రక్కగా వుంచాను.

"ఏమిటీ మనిషి? ఇన్ని నీళ్ళు త్రాగి మళ్ళీ నీళ్ళంటున్నాడేం? అదేం కడుపా చెరువా?" అనుకొన్నట్టుందామె.

ఆమె చెంబు నందుకోబోతూ నా మిత్రుని వంక చూచింది. క్షణంలో తిరిగి వచ్చి చెంబు నక్కడే వుంచింది.

"అదేమిటే అక్కడ పెట్టేశావ్. ఇలా తెచ్చివ్వు" అన్నది ముసలామె.

నేనా మంచం మీదనుండి కదల్లేదు. ఆమె లోపలి నుండి బయటికి రాలేదు. బహుశా ఆమెకు తెలిసిపోయి వుంటుంది. ముసలమ్మ నవ్వుతూ "బలే సిగ్గు" అని చెంబును తెచ్చి నాకందిచ్చింది. ఆ చెంబులో సగం నీళ్ళను త్రాగివేసినట్లు జ్ఞాపకం.

"ఇక వెడదామా?" అన్నాను మిత్రునితో. "ఆహా" అన్నాడతడు.

"సాయంకాలం వస్తామని చెప్పవమ్మా" అన్నాడు నా మిత్రుడు.

ఆమె లోపలి నుండే "ఊఁ" అన్నది. ఇద్దరం బయటకు వచ్చి నాలుగైదు బారలు నడిచాము.

చప్పున ఆగిన నన్ను చూచి "ఏం ఆగిపోయావ్?" అన్నాడు నా మిత్రుడు.

"జోళ్ళు మరచానండీ!" అంటూ వెనక్కి తిరిగాను. నేను మళ్ళీ ఆ ఇంట్లో ప్రవేశిస్తుండగానే ఆమె ఎదురై బిత్తరపోయింది.

"అబ్బే ఏమీ లేదు. జోడుకోసం వచ్చాను" అంటూ జోళ్ళు తొడుక్కుని అటు చూచేలోగా ఆమె కన్పించలేదు. బహుశా నా వ్యంగ్యార్థాన్ని గ్రహించి వుంటుందేమో!"

తుకారాం గ్లాసును అందుకొని నీళ్లు త్రాగుతుంటే సభలో కలకలం బయలు దేరింది. అతడు గ్లాసును బల్లమీద పెట్టి– "కథ పూర్తి కాలేదు. ఆ వెనుక అదృష్టవశాత్తు ఆమెతోనే నా వివాహం జరిగిపోయింది.

వధువుతో ఇంటికి వచ్చేటపుడు మా ఇళ్లలో ఒక ఆచారం వుంది. పెళ్ళి కూతురింటి నుండి పెళ్ళికొడుకు పక్షం వారు ఒక చెంబును దొంగతనంగా తీసుకురావాలి. ఈ ఆచారం వున్నదని నాకు చిన్నతనంలోనే తెలుసు. నాకెటూ ఎక్కువ నీళ్ళు త్రాగే అలవాటుంది కనుకనూ, ఆమె తొలిసారి మంచి నీళ్ళిచ్చిన చెంబు మూడు గ్లాసులు నీళ్ళు పడుతుందనీ ఆ చెంబునే దొంగిలించమని మావారి

కొక అభ్యర్థన చేశాను. మా చెల్లెలికేమో ఏదైనా వెండి చెంబును కాజెయ్యాలని కోరిక. వంద రూపాయల వెండి చెంబుకంటే మూడు రూపాయల గుండు చెంబు నాకు కావాలనుకున్నాను. అదెందుకో నేనా చెంబును ప్రేమించాను. ఏ చెంబుతోనైతే మంచినీళ్ళ నివ్వడాని కామె సిగ్గు పడిందో ఆ చెంబుతోనే రోజూ నీళ్లు అందుకోవాలని ఒక ఆకాంక్ష.

చివరికి మా చెల్లెలు నవ్వుతూ ఆ చెంబును దొంగిలించడానికి ఒప్పుకొన్నది. తీరా చెంబును పెట్టెలో వుంచుకొన్నాక ఒక పేచీ వచ్చింది. ఆ చెంబు వధువు వదినెగారింటి నుండి వచ్చినదట. వదినె తల్లిగారింటి సొమ్మును ఆడుబిడ్డ కివ్వరాదనే నియమం ప్రకారం మమ్మల్ని మరో చెంబు అంతకంటే మంచిదీ వెండిదీ తీసుకపొమ్మన్నారు.

నా కదేమీ నచ్చలేదు. అమ్మాయితో పాటు ఆ చెంబు కూడా రావలసిందే నంటూ పంతం పట్టాను. నా మొరటు పట్టును చూచి పెళ్ళివారంతా విస్తు పోయారు. నే నెందు కలా పట్టుపట్టానో తలంచుకొంటే నాకీనాడూ ఆశ్చర్యంగానే వుంది. కారణం మాత్రం బలమైనదే. అది మా దాంపత్యానికి జీవనాన్నిచ్చిన అమృత కలశం.

చివరకు అలాంటి చెంబునే అప్పటికప్పుడు తెప్పించి, దానిని వారికిచ్చి అసలు చెంబును మా కిచ్చారు.

ఆ చెంబు ఇప్పటికీ మా ఇంట్లో వుంది. ఆ చెంబు నిండుకూ నీళ్ళుంటే చాలు ఒక్కొక్క గ్రుక్కే త్రాగుతూ పేజీల కొద్దీ వ్రాయగలను.

ఇంతకూ అదొక కథా వస్తువని నా అభిప్రాయం. ఆ చెంబు వెనక ఇంత రసవత్తరమైన కథ దాగి వున్నదని ఎవ్వరికీ తెలియదు. బహుశా మా బంధువుల్లో ఒక్కరిద్దరికి మాత్రం తెలిసి వుండవచ్చు ననుకొంటాను.

ఆ చెంబే కాదు. అలాంటి పాత్ర ఎక్కడ కన్పించినా ఆ తొలినాటి ఘట్టం నా కళ్ళకు ప్రత్యక్షమవుతూ వుంటుంది. ఆ ఘట్టాన్ని తలంచుకొని ఆ అమృత కలశాన్ని ప్రసాదించిన భగవంతుని కృతజ్ఞతతో స్మరించుకొంటూ వుంటాను.

ఇందాక చెప్పిందంతా ఉదాహరణ మాత్రమే. ఇలాంటి కథా వస్తువులు ప్రతి వ్యక్తి జీవితంలోనూ వందలాదిగా వుండవచ్చు. అయినపుడు కథా వస్తువులు కరువైనట్లు ఎప్పుడూ ఒకే విధమైన సంఘటనలనూ, ఒకే రకమైన పాత్రలనూ చిత్రించడాన్ని వదలి క్రొత్త పుంతలు త్రొక్కగలరని ఆశిస్తాను."

అయిపోయింది. తుకారాంగారి ఉపన్యాసం.

సభికులంతా లేచి వెళ్ళిన వెనుక తుకారాంగారిని కలుసుకొని వినయంగా ప్రశ్నించాను.

"ఇది నిజంగా మీ అనుభవంలో జరిగిందనుకుంటాను. ఏమంటారు?"

ఆయన నవ్వుతూ "నేను బ్రహ్మచారిని" అన్నాడు. స్తబ్ధుడై ఎంతసేపు నిలబడ్డానో జ్ఞాపకం లేదు.